సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



హుండీ ఆదాయం లెక్కింపు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామి హుండీని లెక్కించగా రూ.28,78,113 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో సదయ్య గురువారం తెలిపారు. ఇది నాలుగు నెలల ఆదాయమన్నారు.



వెటర్నరీ ఆఫీసర్‌గా శంకర్

పెద్దపల్లిరూరల్: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బర్ల శంకర్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను గొర్రెలకాపరుల సంక్షేమ సంఘం నేతలు తిరుపతి, రాములు అభినందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదవుతుంది. జిల్లాలోని పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జీజీహెచ్ తనిఖీ



వార్డు తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 85 పడకల కొత్త బ్లాక్, పాత బ్లాకుల్లోని ఇన్‌పేషెంట్ల వార్డులు పరిశీలించారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. విద్యుత్, తాగునీటి సమస్యల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జనరేటర్ మరమ్మతు, రెనోవేషన్‌కు ప్రతిపాదనలు రూపొందించాలని టీఎస్ఎంసీడీసీ అధికారులకు సూచించారు. అదనపు పడకల బ్లాక్ నీటి సమస్య పరిష్కారానికి ఆర్వో ప్లాంట్ నిర్మిస్తామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంవోలు అరుణ, అప్పారావు, క్వాలిటీ మేనేజర్ అనిల్ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి కొమ్ము గట్టయ్య గురువారం తెలిపారు. అండర్–14, 16, 18, 20లో బాల, బాలికలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కె.సుదేశ్‌ను 94404 24640 ఫోన్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

7న ప్రజాకళల పండుగ



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 7న ప్రజాకళల పండుగ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మీనారాయణ, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ తెలిపారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో గురువారం పండుగ ప్రచార పోస్టర్ విడుదల చేశారు. ఈప్రాంతంలోని కళాకారులు హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో కళాకారులు ఎజ్జ రాజయ్య, నూకల మొండి, రొంటాల లింగయ్య, సంబోదు కొమురయ్య, మాటేటి శంకర్, సిరిసిల్ల మల్లేశ్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి

గోదావరిఖని: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా శ్రమించాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ కోరారు. జూలైలో 3.66 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి 2.72లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 75 శాతం నమోదు చేశావని ఆయన పేర్కొన్నారు. ఈఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 89శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆయన వివరించారు.

జోరు వానలోనూ..

భారీ వర్షాలు కురిసినా నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూలైలో 4.80 లక్షల టన్నులకు 5.47 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 114 శాతం ఉత్పత్తి నమోదు చేశామని ఆయన వెల్లడించారు. అలాగే ఈఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 22.32 లక్షల టన్నుల లక్ష్యానికి 29.64 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 133 శాతంలో నిలిచినట్లు ఆయన వివరించారు.

బాధ్యతలు స్వీకరణ



రమేశ్ రాథోడ్

మంథని: మంథని అటవీ క్షేత్ర అధికారిగా రమేశ్ రాథోడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు కొత్తగూడెం బదిలీ అయ్యారు. బైంసా నుంచి బదిలీపై వచ్చిన రమేశ్ రాథోడ్ విధుల్లో చేరారు.

డీఎస్సీకి 508 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గురువారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 508 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. ఉపాధ్యాయ నియామక పరీక్షకు జిల్లావ్యాప్తంగా 551 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 43 మంది గైర్హాజరయ్యారని డీఈవో వివరించారు. మంథని జేఎన్టీయూలో 201 మందికి 181మంది, పెద్దపల్లి మదర్ థెరిసా కాలేజీలో 170 మందికి 160మంది, ట్రినిటిలో 180 మందికి 167 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో వివరించారు.

ఆశల సాగు

- 'ఎల్లంపల్లి'కి భారీగా ఇన్‌ఫ్లో
- వర్షాలు, వరదలతో జలకళ
- కొనసాగుతున్న ఎత్తిపోతలు
- మధ్యమానేరుకు 4.5టీఎంసీలు



ధర్మారంలోని నంది పంపుహౌస్ నుంచి ఎత్తిపోస్తున్న ఎల్లంపల్లి నీరు

సాక్షి, పెద్దపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పగుళ్లతో ఎత్తిపోతలకు అవకాశం లేకుండా పోయింది. అయితే, జలయజ్ఞంలో భాగంగా నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రస్తుతం రాష్ట్రానికే కల్పతరువుగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సైతం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉన్న ఎల్లంపల్లి.. ప్రస్తుతం కీలకంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక సాగు ఎలా చేయాలని ఉత్తర తెలంగాణ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే, అదను దాటకముందే వరి నాట్లు వేసుకునేందుకు సకాలంలో సాగు నీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గత శనివారం నుంచి నంది పంప్‌హౌస్ నుంచి నిర్విరామంగా ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటివరకు సుమరుగా 4.5 టీఎంసీలను ఇలా మిడ్‌మానేరు ప్రాజెక్టుకు తరలించారు. ప్రస్తుతం నీటి తరలింపు కొనసాగుతూనే ఉంది.

వరద రాక.. ఎస్సారెస్పీ నిండక

ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.715 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు నీటి మట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 146.73 మీటర్లుగా ఉంది. మరోపక్క.. వర్షాలు ఆశించినస్థాయిలో కురవక.. ఉత్తర తెలంగాణ జిల్లాలకు గుండెకాయలాంటి ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, మిడ్‌మానేరు ప్రాజెక్టులు నీరులేక వెలవెలబోతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.5 టీఎంసీలకు ప్రస్తుతం 36.269 టీఎంసీలు ఉంది. ఇందులోంచి కేవలం 664 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాధారణంగా 50 టీఎంసీలు దాటితేనే ఎస్సారెస్పీ నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా సరస్వతీ, లక్ష్మీ, కాకతీయ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తారు. కాకతీయ కాలువ ద్వారా ఎల్ఎండీకి నీటిని తరలిస్తారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎల్ఎండీలోకి భారీగా వరద చేరకపోవడంతో ఎల్లంపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి ఎల్ఎండీకి తరలించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో ఎల్ఎండీ దిగువ ఉన్న కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ల్లోని సుమారు 4.5 లక్షల ఎకరాలకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి.

నిశితంగా పరిశీలిస్తూ..

- ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వరదలను నీటి పారుదల శాఖ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.
- గతంలో ఎత్తిపోతలు చేపట్టాక భారీ వర్షాలు కురవడంతో వరదను దిగువకు విడుదల చేయాల్సి వచ్చింది.
- దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఆచితూచి ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు.
- ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1,240 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 4,674 క్యూసెక్కులు మొత్తంగా 5,914 క్యూసెక్కులు ఎల్లంపల్లిలోకి ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది.
- దీంతో హైదరాబాద్ నగరవాసుల తాగునీటి అవసరాలకు 323 క్యూసెక్కులు, నంది పంపుహౌస్ ద్వారా మధ్యమానేరుకు 12,600 క్యూసెక్కులు తరలిస్తున్నారు.
- ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంపుహౌస్‌లో ఏడు విద్యుత్ మోటార్లు ఉండగా.. గత శనివారం మూడింటితో ఎత్తిపోతలు ప్రారంభించారు. ఐదు రోజుల్లో 4.5 టీఎంసీలను నంది పంపుహౌస్ ద్వారా ఏడో ప్యాకేజీలోని సొరంగాల నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్‌కు తరలించారు.
- గాయత్రి పంపుహౌస్ నుంచి గ్రావిటీ కాలువ ద్వారా ఎస్సారెస్పీ వరద కాలువలోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టుకు తరలిస్తున్నారు.

మరింత సుందరంగా మినీ ట్యాంక్‌బండ్

- ప్రణాళికాబద్ధంగా మున్సిపల్ ఆదాయం పెంపు
- కుక్కల బెడదను పూర్తిస్థాయిలో నియంత్రించాలి
- అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సి ఉంది.. ప్రజలకు ఆహ్లాదం పంచే మినీట్యాంక్‌బండ్‌ను సుందరీకరించాలి.. సందర్శకులకు కనీస సౌకర్యాలు కల్పించాలి' అని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. పట్టణంలోని(ఎల్లమ్మ చెరువు) మినీట్యాంక్‌బండ్‌ను గురువారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి ఆయన సందర్శించారు. మినీట్యాంక్‌బండ్ వద్ద టాయిలెట్లు నిర్మించాలన్నారు. బోటింగ్‌కు అవసరమైన జెట్టి తెప్పించాలని ఆదేశించారు.

రూ.30కోట్లతో పట్టణాభివృద్ధి..

పట్టణంలో రూ.30కోట్ల అంచనా వ్యయంతో వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా మంజూరైన రూ.30కోట్లతో పనులు చేపట్టాలని సూచించారు. డంపింగ్‌యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. మున్సిపల్ ఆదాయ వనరులు పెంచుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షాపింగ్ కాంప్లెక్స్ గదుల అద్దె, ఇతర పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు.

కుక్కల బెడదను నియంత్రిద్దాం..

మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన కలెక్టర్ శ్రీహర్ష.. కుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుక్కలను పట్టుకుని రామగుండంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించాలని సూచించారు. అక్కడ కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం' అమలు చేయండి

ఈనెల 5 నుంచి 9వ తేదీవరకు స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి కోరారు. గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామ, వార్డుస్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. కాగా, జిల్లాలో ఈనెల 5న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు సూచించారు. 6న తాగునీటి సరఫరా, ఇంకుడుగుంతల నిర్మాణం, 7న డ్రైనేజీ, నీటినిల్వ ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలన్నారు. 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణకు చర్యలు, 9న డ్రైడే చేపట్టి ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయాలని ఆయన ఆదేశించారు. డీపీవో ఆశాలత, డీఆర్డీవో రవీందర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఎఫ్‌వో శివయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు

- గర్భిణులకు '102' సేవలు అందించాలి
- కలెక్టర్ శ్రీహర్ష

సాక్షి ఎఫెక్ట్..



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: స్థానిక మాతాశిశు ఆస్పత్రికి వచ్చే గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే అవకాశం కల్పించొదని, సర్కారు ఆస్పత్రుల్లోనే ఆధునిక సౌకర్యాలు కల్పించామని, ఇక్కడే ప్రసవించేలా చూడాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. 'కడుపుకోతలు' శీర్షికన గురువారం 'సాక్షి' ప్రచురించిన కథనానికి కలెక్టర్ స్పందించారు. స్థానిక మాతాశిశుసంరక్షణ ఆస్పత్రి సందర్శించారు. గర్భిణులను ఇంటి నుంచి ఆస్పత్రికి 102 అమ్మఒడి వాహనంలో తీసుకొచ్చి మళ్లీ ఇంటివద్దకు చేర్చాలని సూచించారు. టిఫా స్కానింగ్ యంత్రాన్ని వినియోగించుకోవాలన్నారు. శిశువుకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు వీలుగా నవజాత శిశువు సంరక్షణ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలివ్వాలని కలెక్టర్ అన్నారు. లేబర్‌వార్డు, ఆపరేషన్ థియేటర్ వైద్యులు తమపని పూర్తయ్యాక ఓపీ కూడా చూడాలన్నారు. ఆయన వెంట డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

వేతన సవరణకు కృషి

- కనీసవేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: రాష్ట్రంలోని 1.20కోట్ల మంది కాంట్రాక్టు కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన సవరణకు కృషి చేస్తున్నామని కనీస వేతన మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. వేతన మండలి చైర్మన్‌గా నియమితులయ్యాక తొలిసారి గురువారం 'ఖని'కి వచ్చిన సందర్భంగా ఐఎన్టీయూసీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ తీన్‌రాస్తావద్ద అంబేడ్కర్ విగ్రహానికి, ప్రధాన చౌరస్తాలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జనక్ ప్రసాద్ మాట్లాడారు. తాను చైర్మన్ నియామకమైన రెండో రోజే ఐఎల్‌వోతో మాట్లాడి శాస్త్రీయ వేతరణ సవరణపై చర్చించామన్నారు. త్వరలోనే ఆమోదయోగ్యమైన వేతన సవరణ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఎన్టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, అక్రం, దాస్, వికాస్‌కుమార్‌యాదవ్, బదావత్ శంకర్‌నాయక్, సదానందం, కొత్త సత్యనారాయణరెడ్డి, ఆరేపల్లి శ్రీనివాస్, గడ్డం కృష్ణ, దశరథం పాల్గొన్నారు.

ప్యాకేజీలుగా 'ఎన్‌హెచ్ 563'

- జగిత్యాల–గంగాధర 28 కి.మీ.కు రూ.848 కోట్లు
- గంగాధర–కరీంనగర్ బైపాస్ వరకు 30.9 కి.మీ.కు రూ.893 కోట్లు
- డిసెంబర్ లేదా జనవరిలో ఫోర్‌లేన్ రహదారి పనులు ప్రారంభం
- పలు సివిల్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేస్తున్నట్లు సమాచారం



గట్టుదుద్దెనపల్లి వద్ద టోల్‌గేట్ పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రతిష్టాత్మక ఎన్‌హెచ్–563 జగిత్యాల–కరీంనగర్ సెక్షన్ ఫోర్ లేన్ రహదారి పనులకు దేశవ్యాప్తంగా పలు సివిల్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేస్తున్నట్లు సమాచారం. వచ్చే నెలలో అధికారులు టెండర్లు ఓపెన్ చేసి, ఖరారు చేయనున్నారు. డిసెంబర్ లేదా జనవరిలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ముందస్తుగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకుసాగుతున్నారు. ఇప్పటికే ఈ పనులపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యవేక్షణ చేస్తున్నారు. వరంగల్–కరీంనగర్ సెక్షన్‌లో ఇప్పటికే పనులు ఊపందుకున్నాయి. అయితే, పలుచోట్ల న్యాయ వివాదాల కారణంగా కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాటిని ఇటీవల కోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో వారంతా తిరిగి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిసింది.

పని విభజన..

తాజా సమాచారం ప్రకారం.. ఈ రహదారిలో రెండు కీలక(వరంగల్–కరీంనగర్ సెక్షన్ 68 కి.మీ., కరీంనగర్–జగిత్యాల సెక్షన్ 58.9 కి.మీ.) సెక్షన్లు ఉన్నాయి. జగిత్యాల–కరీంనగర్ సెక్షన్‌లో పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటిది జగిత్యాల నుంచి గంగాధర వరకు 28 కి.మీ. దూరం. దీన్ని పూర్తిచేయడానికి రూ.848.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. రెండోది గంగాధర–కరీంనగర్ బైపాస్(కొత్తపల్లి శివారు) వరకు 30.9 కి.మీ. దూరం. దీన్ని పూర్తి చేసేందుకు రూ.893.79 కోట్లు వెచ్చించనున్నారు. మొత్తంగా ఒకే సెక్షన్‌లోని పనులను విభజించి, రెండు కంపెనీలకు టెండర్లు ఇవ్వాలన్నది అధికారుల వ్యూహంగా కనిపిస్తోంది. రహదారి పనులు వచ్చే ఏడాది జూలై 16వ తేదీ నాటికి పూర్తి చేయాలన్న సంకల్పంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఉన్నారు. డిజైన్, బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్(డీబీవోటీ) విధానంలో రోడ్డు నిర్మాణం చేపడతారు.

పూడూరు సమీపంలో టోల్‌గేట్..

కరీంనగర్–జగిత్యాల సెక్షన్‌లో టెండర్లు తెరుచుకున్నాయి. 58.9 కి.మీ. రోడ్డుకు రూ.222.7 కోట్లు ఖర్చవనుంది. ఇందులో భూసేకరణకు రూ.387.15 కోట్లు వెచ్చించనున్నారు. వాస్తవానికి ఈరోడ్డు నిర్మాణ అంచనా వ్యయం రూ.1,503.73 కోట్లు మాత్రమే. జీఎస్టీ, భూ సేకరణ కలుపుకొని రూ.2,227 కోట్లకు చేరింది. ఈ క్రమంలో పూడూరు సమీపంలో టోల్‌గేట్ నిర్మిస్తున్నారు. తొలుత గంగాధర సమీపంలో నిర్మిస్తారని ప్రచారం జరిగింది. టోల్‌గేట్ సమీపంలో ఇరువైపులా ట్రక్కులు ఆగేలా ట్రక్ బే, రెస్ట్ ఏరియాలు నిర్మిస్తున్నారు. 24 బ్రిడ్జిలు(18 మైనర్, 06 మేజర్), 03 ఆర్వోబీ/ఆర్‌యూబీ, 27 మేజర్ జంక్షన్లు, 29 మైనర్ జంక్షన్లు కూడా నిర్మిస్తారు.

ఉగ్గబట్టుకుంటున్నారు..

- ఒకటికి, రెంటికి తిప్పలు
- అవస్థలు పడుతున్న మహిళలు
- సందర్శకులవీ అవే అవస్థలు
- జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్ల సమస్య



ఈమె పేరు బొంకూరి భాగ్యలక్ష్మి. కమాన్‌చౌరస్తాలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఫ్లెక్సీతో బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నారు. ఒప్పందం జరిగి, కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి రెండేళ్లు గడిచినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారితోపాటు స్థానికులూ మూత్రవిసర్జన కోసం ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.



మూత్రవిసర్జన చేయకుండా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో వేసిన ముళ్ల కంచె

పెద్దపల్లిరూరల్: వివిధ ప్రాంతాల నుంచి సుమారు 20వేల మంది తమ అవసరాల కోసం నిత్యం జిల్లా కేంద్రానికి వచ్చిపోతున్నారు. వీరితోపాటు చిరు వ్యాపారులు, చిన్నాచితకా కార్యాలయాలు, ప్రైవేట్ ఆఫీసుల్లో పనిచేసే సిబ్బంది కూడా ఉన్నారు. పట్టణ జనాభా సుమారు 80వేలు. అయితే, పట్టణ జనాభా, సందర్శకుల అవసరాలకు అనుగుణంగా జిల్లా కేంద్రంలో సరిపడా పబ్లిక్ టాయిలెట్లు లేవు. కొత్తగా రెండు నిర్మించాలని ప్రతిపాదించినా స్థల సమస్యతో ముందుకు సాగడంలేదు. ఇక ఆర్టీసీ బస్టాండ్, కూనారం రోడ్డులోని శ్మశానవాటిక, కూరగాయల మార్కెట్ సమీపంలో సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. అక్కడి ప్రజానీకం అవసరాలను ఇవి తీర్చుతున్నాయి. కానీ, నిత్యం రద్దీగా ఉండే ప్రధానకూడళ్లు కమాన్‌చౌరస్తా, జెండా చౌరస్తాలో పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు.. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ముళ్లకంచె..

మున్సిపల్ కార్యాలయం ఎదుట పబ్లిక్ టాయిలెట్లు నిర్మించినా వివిధ కారణాలతో నిరుపయోగమయ్యాయి. సమీపంలోని డ్రైనేజీలో మూత్రవిసర్జన చేయడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు చేసిన ఫిర్యాదుతో అక్కడ ముళ్లకంచె వేయడం సమస్యను మరింత జటిలం చేసింది.

మహిళల బాధ వర్ణనాతీతం..

తమ అవసరాల కోసం వివిధ ప్రాంతాల ప్రజలు మల, మూత్రవిసర్జనకు నానాపాట్లు పడుతున్నారు. అయితే, ఇందులో మహిళల బాధ వర్ణనాతీతం. ప్రధాన కూరగాయల మార్కెట్ సమీపంలో(సాగర్ రోడ్డు వైపు) నిర్మించిన పబ్లిక్‌టాయిలెట్‌లో పైసలిస్తేనే అనుమతిస్తున్నారు. దీంతో పొద్దంతా సంపాదించిన సొమ్ములో రూ.20 నుంచి రూ.30 వరకు మల, మూత్ర విసర్జనకే వెచ్చించాల్సి వస్తోందని చిరువ్యాపారులు వాపోతున్నారు.

కమాన్ సెంటర్‌లో స్థలంలేదట..

కమాన్ ప్రాంతంలోని పెట్రోల్‌బంక్ వద్ద సులభ్ కాంప్లెక్సు నిర్మించాలని అధికారులు తీర్మానించారు. అక్కడ ప్రతికూల పరిస్థితులు ఎదురవడంతో మరోచోట అయినా నిర్మించలేకపోయారు.

ఇబ్బందిగా ఉంది



మున్సిపల్ ఆఫీసు ముందున్న పబ్లిక్ టాయిలెట్లు పనిచేయడం లేదంటున్నరు. తక్షణమే మరమ్మతు చేయించాలి. మూత్రవిసర్జనకు ఇబ్బందిగా ఉంది.

– అంజయ్య, శంకర్‌గంజ్ పెద్దపల్లి

నిర్వహణ కష్టం



పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ కష్టంగా మారింది. మూత్ర విసర్జన ఉచితమే. కానీ, సులభ్ కాంప్లెక్స్ మరమ్మతుల కోసం రూ.5 ఇవ్వాలని కోరుతున్నం.

– దిలీప్‌సింగ్, పబ్లిక్‌టాయిలెట్ నిర్వాహకుడు

స్థలం కొరత ఉంది



బల్దియాలోని ప్రధాన కూడళ్లలో కొత్తగా రెండు పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాల్సి ఉంది. నిధులు ఉన్నాయి కానీ స్థలమే లభించడం లేదు. మున్సిపల్ ఆఫీసు సమీపంలోని వాటికి మరమ్మతు చేయాల్సి ఉంది. దీనిపై కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం.

– వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్

సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

గోదావరిఖని: సీఎం రేవంత్‌రెడ్డి ఆడబిడ్డలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మహిళా ఎమ్మెల్యేతో అగౌరవంగా మాట్లాడిన సీఎం పద్ధతి మార్చుకోవాలన్నారు. మహిళల సంక్షేమానికి పథకాలు ప్రవేశపెడతామని చెప్పిన కాంగ్రెస్ ఒక్కటికూడా అమలు చేయలేదని విమర్శించారు. ఉచిత ఆర్టీసీ బస్‌ప్రయాణం ప్రవేశ పెట్టినా.. అందులో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డుగా పెట్టుకొన్న సీఎం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అసెంబ్లీలో అనుచిత వాఖ్యలు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గం మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు రజిత, కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలీదేవి, రాకం లత, ముద్దసాని సంధ్యారెడ్డి, రమ్యయాదవ్, సమ్మెట సప్న, లక్ష్మి, తిరుమల, మేకల సరోజన, పద్మ, సరోజన, నాయకులు శ్రీనివాస్, మొగిలి, రవీందర్ ఉన్నారు.

క్లుప్తంగా

బుగ్గారం ఏఎస్సై సస్పెన్షన్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై లక్ష్మీనారాయణ ఎస్సైతోపాటు తోటి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను సస్పెండ్‌ చేస్తూ గురువారం మల్టీ జోన్‌ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

అనారోగ్యంతో గల్ఫ్‌ కార్మికుడు మృతి


పెండ్యాల శ్రీకాంత్‌ (ఫైల్‌)

వేములవాడరూరల్‌: వేములవాడ రూరల్‌ మండలం నూకలమర్రికి చెందిన గల్ఫ్‌ కార్మికుడు పెండ్యాల శ్రీకాంత్‌(55) అనారోగ్యంతో అబుదాబిలో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధి కోసం వెళ్తున్న ఆయన అక్కడే ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో జూలై 29న ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంగీతో మహిళ మృతి

- మర్రిగడ్డలో విషాదం


అంజలి(ఫైల్‌)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన గజవాడ అంజలి(53) డెంగీతో గురువారం మృతిచెందింది. అంజలి ఐదు రోజుల క్రితం అనారోగ్యం బారిన పడగా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి డెంగీతోపాటు ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని తెలిపారు. దీంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలుకు భర్త జనార్దన్‌, కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యార్థికి డెంగీ

ముస్తాబాద్‌(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన మీస రోహిత్‌ డెంగీతో బాధపడుతున్నాడని వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. సిద్దిపేట జిల్లా పాలమాకుల మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రోహిత్‌కు హాస్టల్‌లో ఉండగానే జ్వరం బారిన పడ్డాడు. తల్లిదండ్రులు గురువారం పోతుగల్‌ పీహెచ్‌సీకి తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. రోహిత్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. రోహిత్‌ ఇంటి వద్ద గురువారం వైద్యసిబ్బంది దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. సూపర్‌వైజర్లు ఫయాజ్‌, వెంకటాచారి, ఏఎన్‌ఎంలు ధనలక్ష్మి, కొల్లూరు రేణుక, ఆశవర్కర్లు రేణుక, జ్యోతి ఉన్నారు.

ఉత్పత్తిలో సింగరేణి దూకుడు

- నాలుగు నెలల్లో 20 మిలియన్‌ టన్నుల ఉత్పత్తి
- 96 శాతం నమోదు చేసిన బొగ్గు గనులు
- 133శాతం ఉత్పత్తి నమోదుతో అగ్రస్థానంలో ఆర్జీ–2 డివిజన్‌



బొగ్గు ఉత్పత్తి సమాచారం

2024–25 లక్ష్యం	72 మిలియన్‌ టన్నులు
తొలినాలుగు నెలలు	జూలై నాటికి
లక్ష్యం	21.84 మిలియన్‌ టన్నులు
సాధించింది	20.94 మిలియన్‌ టన్నులు

గోదావరిఖని: సింగరేణి బొగ్గుగనుల సంస్థ ఉత్పత్తి లక్ష్య సాధనలో దూసుకెళ్తోంది. భారీ వర్షాలు కురుస్తున్నా.. వెనక్కి తగ్గడంలేదు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే ఓసీపీల్లో ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోంది. దీంతో ఈనెలలో ఉత్పత్తిపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరం తొలినాలుగు నెలల్లో ఉత్పత్తి లక్ష్య సాధన దిశగా పయనించింది. మొత్తం 11 ఏరియాలు ఉత్పత్తిలో పోటీపడుతున్నాయి. జూన్‌ చివరినాటికి 21.84 మిలియన్‌ టన్నుల బొగ్గు ఉత్పత్తికి 20.94 మిలియన్‌ టన్నులు సాధించి 96 శాతం నమోదు చేశాయి.

వార్షిక లక్ష్యం 72 మిలయన్‌ టన్నులు..

- సింగరేణి 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్‌ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించింది. గడిచిన నాలుగు నెలల్లో 218.47లక్షల టన్నుల ఉత్పత్తికి 209.40 లక్షల టన్నులు సాధించి 96 శాతం నమోదు చేసింది. ఆర్జీ–2 ఏరియా 133శాతం బొగ్గు ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలవగా.. భూపాలపల్లి ప్రాజెక్టు 69 శాతంతో చివరి స్థానంలో ఉంది.

మరో మూడు ఏరియాలు కూడా..

- వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో తొలినెలలో నాలుగు ఏరియాలు ముందంజలో ఉన్నాయి. ఆర్జీ–2 ఏరియా 133 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ముందంజలో ఉండగా, ఇల్లెందు ఏరియా 114 శాతంతో రెండోస్థానం, 101 శాతంలో బెల్లంపల్లి ఏరియా మూడోస్థానం, 98 శాతంతో మణుగూరు ఏరియా నాలుగోస్థానంలో నిలిచాయి. భవిష్యత్‌లో ఉత్పత్తి లక్ష్య సాధన దిశగా సీఎండీ బలరాం ఏరియా వారీగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్నారు.

ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి వివరాలు(లక్షల టన్నుల్లో..)

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ–1	15.82	14.09	89
ఆర్జీ–2	22.32	29.64	133
ఆర్జీ–3	20.33	19.35	95
ఏపీఏ	2.95	2.85	97
భూపాలపల్లి	12.83	8.89	69
కొత్తగూడెం	45.11	41.76	93
ఇల్లెందు	11.80	13.46	114
మణుగూరు	41.89	41.14	98
బెల్లంపల్లి	12.10	12.17	101
మందమర్రి	12.69	10.33	81
శ్రీరాంపూర్‌	20.60	15.66	76

సీఎంఆర్‌ ఇవ్వని రైస్‌ మిల్‌ యజమాని అరెస్ట్‌

- రూ.3.10 కోట్ల విలువైన బియ్యం పక్కదారి
- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌ వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ రఘు చందర్‌

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకుని.. సీఎంఆర్‌ (కస్టమ్‌ మిల్లింగ్‌ రైస్‌) ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్‌ యజమానిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌ తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. పెగడపల్లి శివారులోని హరిహర రైస్‌మిల్‌ యజమాని గంగం వెంకట్‌రెడ్డి సివిల్‌ సప్లై కార్పొరేషన్‌తో ధాన్యాన్ని బియ్యంగా మార్చి అప్పగించేందుకు 2022–23 సంవత్సరానికి గాను ఒప్పందం చేసుకున్నాడు. సుమారు రూ.3,10,82,310 విలువైన 12,728.74 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. అక్రమాలకు పాల్పడినట్లు కార్పొరేషన్‌ జిల్లా మేనేజర్‌ వి.హథిరామ్‌ పెగడపల్లి ఎస్సై రవికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా నిబంధనలు ఉల్లంఘించి, సీఎంఆర్‌లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో మిల్లు యజమానిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్సై సీహెచ్‌. రవికిరణ్‌ పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన బుధవారంపేట గ్రామస్తులు

రామగిరి(మంథని): తమకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా, పరిహారం అందేలా చూడాలని కోరుతూ బుధవారంపేట గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. నిర్వాసితుల కథనం ప్రకారం.. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 విస్తరణ కోసం రాజాపూర్‌ గ్రామానికి చెందిన 218 మంది రైతుల నుంచి 708 ఎకరాలు సేకరించడానికి సింగరేణి నిర్ణయించింది. ఇందుకోసం 2009లో డ్రాఫ్ట్‌ డిక్లరేషన్‌ ప్రకటించింది. 2011లో నోటిఫికేషన్‌ జారీచేసి 2015లో అవార్డు జారీచేసింది. దీంతో రైతుల భూములు సింగరేణి స్వాధీనం చేసుకున్నట్లు పరిగణించింది. కానీ, పరిహారం విషయంలో గతంలో కొందరు హైకోర్టును ఆశ్రయించగా 2022లో అవార్డు రద్దు చేస్తూ, రైతులకు పట్టాదారు పాస్‌ పుస్తకాలు అందజేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇక తమ కష్టాలు తీరుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ, మరో 88 ఎకరాల భూ సేకరణకు సింగరేణి నోటిఫికేషన్‌ జారీచేసింది. అయితే, భూములతోపాటు తమ ఇళ్లను కూడా స్వాధీనం చేసుకుంటేనే సింగరేణికి సహకరిస్తామని రాజాపూర్‌ గ్రామస్తులు తెలిపారు. తమకు పరిహారం అందకపోవడంతోపాటు పట్టాదారులుగా గుర్తించకపోవడంతో రైతు బంధు, రైతుబీమా, పీఎం కిసాన్‌, క్రాఫ్‌లోన్‌లు వంటి సంక్షేమ పథకాలు పొందలేకపోయామని బుద్దార్థి బుచ్చయ్యతోపాటు 15 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈవిషయాలపై అడ్వకేట్‌ పోనంపల్లి రవి రిట్‌పిటిషన్‌ వేయగా గురువారం సింగిల్‌బెంచ్‌ ధర్మాసనం విచారించింది. సమస్యలు విన్న హైకోర్టు.. రికార్డుల్లో రైతుల పేర్లు ఎందుకు చేర్చలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు అడ్వకేట్‌ తెలిపారు. ఈమేరకు నాలుగు వారాల్లో కౌంటర్‌ దాఖలు చేయాలని, లేకుంటే రిట్‌ పిటిషన్‌కు అను మతి ఇస్తూ ప్రభుత్వానికి జరిమానా విధిస్తామని ధర్మాసనం వెల్లడించినట్లు అడ్వకేట్‌ వివరించారు.

ప్రభుత్వ వైద్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పెండెం గోపి అనే రోగి శస్త్రచికిత్సను నిర్లక్ష్యం చేయడంతోపాటు ఇదేంటని అడిగినందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురు వైద్యులు, ఐదుగురు సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. జగిత్యాల అర్బన్‌ మండలం ధరూర్‌ గ్రామానికి చెందిన గోపి కాలులో ఉన్న రాడ్‌ను తీయించుకునేందుకు జూన్‌ 25న జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. శస్త్రచికిత్స సమయంలో వైద్యులు వెన్నుభాగంలో మత్తుమందు ఇచ్చి వైద్యుడు సెల్‌ఫోన్‌ చూస్తూ ఉండిపోయాడు. మహిళా డాక్టర్‌ వచ్చి సదరు డాక్టర్‌ను మందలించి మళ్లీ నడుం భాగంలో మత్తు మందు ఇచ్చారు. శస్త్ర చికిత్స సమయంలో కింద ఉన్న కరెంట్‌ వైర్లు కుడి చేయికి షాకిచ్చాయని, చర్మం కాలిపోతోందని మొరపెట్టుకున్నా వైద్యులు నిర్లక్ష్యంగా సర్జరీ చేశారు. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుందని చెప్పినా ఆక్సిజన్‌ పెట్టకుండా నరకయాతన చూపారు. సర్జరీ గది నుంచి బయటకు వచ్చిన తర్వాత రోగి మామ కంటె నర్సయ్య వైద్యులను ప్రశ్నిస్తే కులం పేరుతో దూషించారని బాధితులు వైద్యులు శంబు, వికాస్‌, నవీన్‌, రాములు, ప్రణీష, హరికృష్ణ, రాహూల్‌, సిబ్బంది తిరుపతి, ఎండీ.బాబా, బెజ్జంకి సతీశ్‌, సంజీవ్‌, జుంబర్తి భిక్షుపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు


గాయాలతో చిన్నారి హజారా బేగం

రాయికల్‌: రాయికల్‌లో గురువారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఆరేళ్ల చిన్నారి హజారే బేగం, బద్దం రమ, తోకల లక్ష్మీనర్సయ్య, చిర్ర రమేశ్‌పై దాడి చేశాయి. వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి వ్యాక్సినేషన్‌ వేయించారు. ఒకే రోజు నలుగురిపై కుక్కలు దాడి చేయడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

కోతులదాడిలో వృద్ధురాలికి గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన వృద్ధురాలు సిర్రం మల్లవ్వ(65) గురువారం తీవ్రంగా గాయపడింది. కోతుల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో కింద పడి పోవడంతో మోకాలు తుంటి విరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో రోజురోజుకు కోతుల బెడద తీవ్రమవుతుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం


అంజయ్య (ఫైల్‌)

గంగాధర: కరీంనగర్‌ జిల్లా గంగాధర మండలంలోని వెంకటాయపల్లికి చెందిన గుండు అంజయ్య (40) గురువారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామంలోని స్టేజీ వద్ద కేబుల్‌ వైర్‌ సరిచేసేందుకు అంజయ్య పోలు ఎక్కుతుండగా విద్యుత్‌ షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈయన కూతురు గతేడాది స్కూల్‌డే రోజు డ్యాన్స్‌చేస్తూ గుండెపోటుతో మృతిచెందింది. అంజయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రేషన్‌ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్‌బియ్యం

గోదావరిఖని: పట్టణంలోని రమేశ్‌నగర్‌లో అక్రమంగా నిల్వచేసిన 4.27క్వింటాళ్ల రేషన్‌ బియ్యం, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 13 గృహ సిలిండర్లను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్‌ తెలిపారు. గురువారం రమేశ్‌నగర్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. టి.సత్యం అనే వ్యక్తి వద్ద 4.27 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న రెండు గ్యాస్‌ సిలిండర్లను, అదే సమయంలో రాజవీరు అనేవ్యక్తి వద్ద 11 గ్యాస్‌ సిలిండర్లు పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

- యువకులను చితకబాదిన స్థానికులు
- పోలీసులకు అప్పగింత


యువకులను చితకబాదుతున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని దేవునిగోవిందుపల్లిలో నివాసముంటున్న ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులను స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. దేవునిగోవిందుపల్లిలో ఓ మహిళ అద్దెకుంటోంది. గురువారం సాయంత్రం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికులు వారిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.

గురుకులం విద్యార్థులు సేఫ్‌

- ఆస్పత్రి నుంచి ఇద్దరు పిల్లల డిశ్చార్జి
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు, అధికారులు


ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి చేరిన విద్యార్థి గణేశ్‌

మెట్‌పల్లిరూరల్‌: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌ గురుకులంలో జూలై 25న అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మూడురోజుల క్రితం హర్షవర్ధన్‌.. బుధవారం సాయంత్రం గణేశ్‌ను డిశ్చార్జి చేశారు. ఈ ఇద్దరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. గురుకులంలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురై ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన జిల్లా అధికార యంత్రాంగం వారి ఆరోగ్య పరిస్థితిపై దృష్టి సారించింది. కలెక్టర్‌ సత్యప్రసాద్‌ ఆదేశాలతో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌, డీఎంహెచ్‌వో సమియోద్దీన్‌, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, ఇతర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించారు. మొదట మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌ తరలించారు.

హైదరాబాద్‌కు తరలించాకే...

నిజామాబాద్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఒక దశలో అధికార యంత్రాంగం తీవ్రంగా ఆందోళన చెందింది. వెంటనే అప్రమత్తమై మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. వైద్యాధికారులు విద్యార్థుల వెంట హైదరాబాద్‌ వెళ్లారు. నిమ్స్‌కు తరలించాకే విద్యార్థులు ఆరోగ్యం మెరుగుపడింది.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విషయంలో తీవ్రంగా ఆందోళన చెందిన అధికారులు ప్రస్తుతం ఊపిరి పీల్చుకున్నారు. అస్వస్థతకు గురైన ఇద్దరు డిశ్చార్జి కావడంతో వారి కృషి ఫలించినట్లైంది.

గురుకుల పాఠశాల పరిశీలన

గురుకులం పాఠశాలను ఆల్‌ ఇండియా అంబేద్కర్‌ యువజన సంఘ సభ్యులు గురువారం పరిశీలించారు. ఘటనపై ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ మహిపాల్‌రెడ్డితో ఆరా తీశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌, మెట్‌పల్లి డివిజన్‌ అధ్యక్షుడు తుక్కారం, కోరుట్ల డివిజన్‌ అధ్యక్షుడు శోభన్‌, మెట్‌పల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్‌ ఉన్నారు.

అటవీ శాఖలో పలువురి బదిలీలు

- కరీంనగర్‌ ఎఫ్‌ఆర్‌వోగా షౌకత్‌ హుస్సేన్‌

కరీంనగర్‌ అర్బన్‌: కరీంనగర్‌ ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ (ఎఫ్‌ఆర్‌వో)గా షౌకత్‌ హుస్సేన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఎఫ్‌ఆర్వోగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్‌ జిల్లాకు బదిలీ చేసింది. అలాగే, గంగాధర డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ కిరణ్మయిని స్ట్రైకింగ్‌ ఫోర్స్‌కు కేటాయించగా, ఆమె స్థానంలో సిరిసిల్ల డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ బాపిరాజును నియమించింది. చొప్పదండి ఎఫ్‌ఎస్‌వో భరణిని కామారెడ్డి బదిలీ చేసింది.

సీపీవో కార్యాలయంలో..

సీపీవో కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ ఎస్‌వోలు శ్రీనివాస్‌ హైదరాబాద్‌కు, సంపత్‌ సిద్దిపేటకు, రాంప్రసాద్‌రెడ్డి సెక్రటేరియట్‌కు, జమ్మికుంట ఎంపీఎస్‌వో హైమావతి హైదరాబాద్‌కు, సీనియర్‌ అసిస్టెంట్‌ సునంద సిరిసిల్లకు, జ్యోతి(కరీంనగర్‌ ఆర్డీవో ఆఫీస్‌)ను సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌కు, ఉమారాణి(హైదరాబాద్‌), అంజయ్య(సిరిసిల్ల)లను కరీంనగర్‌ సీపీవో కార్యాలయానికి బదిలీ చేశారు. వాసుదేవరెడ్డి(హైదరాబాద్‌)ని కరీంనగర్‌ ఆర్డీవో కార్యాలయానికి, సీనియర్‌ అసిస్టెంట్‌ హేమలత(సిరిసిల్ల)ను కరీంనగర్‌కు, ఎంపీఎస్‌వో రమేశ్‌(సిరిసిల్ల)ను జమ్మికుంటకు కేటాయించారు.

ఒలింపియాడ్‌లో ‘అల్ఫోర్స్‌’ విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఎస్‌వోఎఫ్‌ నిర్వహించిన అంతర్జాతీయ జనరల్‌ నాలెడ్జ్‌ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్‌ ఇ–టెక్నో స్కూల్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, పతకాలు, నగదు బహుమతి సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. డి.స్తుతి (ఎనిమిదో తరగతి), బి.యశ్వంత్‌ కృష్ణ, మాజ్‌ హుస్సేన్‌(తొమ్మిదో తరగతి), బి.కార్తికేయ (ఐదోతరగతి)లు పతకాలతోపాటు రూ.500 నగదు బహుమతి గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న నరేందర్‌ రెడ్డి

కొత్తపల్లి: డెంగీ వ్యాధిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అల్ఫోర్స్‌ విద్యా సంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌ రెడ్డి అన్నారు. కరీంనగర్‌ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్‌ బాలికల ఈటెక్నో స్కూల్‌లో గురువారం సైన్స్‌ విభాగం ఉపాధ్యాయులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్‌ అవిష్కరించారు. డెంగీ భయంకరమైనదని, ప్రాణహాని కలిగిస్తుందని తెలుపుతూ ఈ వ్యాధి సోకినవారు సరైన వైద్యం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు వ్యాప్తిచెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో దృశ్యమాలికల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌, సైన్స్‌ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పారమిత’లో స్కౌట్‌ స్కార్ఫ్‌ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న హెచ్‌ఎంలు, విద్యార్థులు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: కరీంనగర్‌ మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ స్కౌట్‌ స్కార్ఫ్‌ దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రశాంత్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ వ్యవస్థాపకులు రాబర్ట్‌ బాడెన్‌ పావెల్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి, స్కౌట్స్‌ జెండా ఎగురవేసి, వేడుకలను ప్రారంభించారు. స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ సంస్థ సమాజ సేవకు సిద్ధంగా ఉంటాం అనే నినాదంతో ప్రజలకు సేవ చేస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి శిక్షణ తీసుకొని, విలువలతో కూడిన జీవితాన్ని గడుపుతూ దేశ సేవ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్‌ ప్రసాదరావు స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, వి.యు.ఎం.ప్రసాద్‌, టీఎస్వీ.రమణ, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత, కెప్టెన్‌ రజిత, స్కౌట్స్‌ మాస్టర్‌ శ్రీనునాయక్‌ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల వంటావార్పు


రోడ్డుపై అల్పాహారం తింటున్న కార్మికులు

గంగాధర(చొప్పదండి): తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్‌ చేస్తూ గర్శకుర్తి చేనేత కార్మికులు చేపట్టిన రిలే నిరహార దీక్ష గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు వంటావార్పుతో నిరసన తెలిపారు. దీక్ష చేస్తున్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి చేసిన చీరలు అమ్ముడుపోక, కొత్తగా వస్త్ర తయారీకి ఎటువంటి ఆర్డర్లు లేక పస్తులుండే పరిస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి, తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గడ్డం నారాయణ, అలువాల విఠోభ, అన్నల్‌దాస్‌ శ్రీనివాస్‌, రేణికుంట శ్రీనివాస్‌, సామల శంకర్‌, కొలిపాక తిరుపతి, అలువాల శ్రీశైలం, వెంకటేశ్‌, బూర్ల శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పీల్చుతున్న ఇద్దరు యువకుల రిమాండ్‌


గంజాయి పీల్చుతూ పట్టుబడ్డ యువకులను అరెస్టు చూపుతున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను చందుర్తి మండలం మూడపల్లి శివారులో సీఐ వెంకటేశ్వర్లు గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. చందుర్తి సర్కిల్‌ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మూడపల్లి శివారులో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లెకు చెందిన చీకుంట గణేశ్‌, కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చిట్కూరి ఈశ్వర్‌ పట్టుబడ్డారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.